క్లుప్తంగా

వికలాంగ పింఛన్లు పొందే వారికి మళ్లీ వైద్య పరీక్షలు

ఎంపీడీవో షేక్ మహబూబ్ సుభాని

చెరుకుపల్లి: రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సామాజిక భద్రతా పింఛన్ల పథకంలో కొందరు అనర్హులు వికలాంగ పింఛన్లు పొందుతున్నట్లు ప్రభుత్వ అధికారులు గుర్తించారని మండల అభివృద్ధి అధికారి షేక్ మహబూబ్ సుభాని గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. పింఛన్ల పునః పరిశీలనలో భాగంగా జిల్లా కలెక్టర్ వారి ఆదేశాల మేరకు మండల పరిధిలో లోకో మోటార్ లోపంతో పింఛన్ తీసుకుంటున్న 863 మందికి రేపల్లె ఏరియా వైద్యశాలలో ఈ నెల 22వ తేదీ నుంచి జూలై మొదటి వారం వరకు షెడ్యూల్ ప్రకారం వైద్య పరీక్షలు జరుగుతాయని ఎంపీడీవో తెలిపారు. పింఛన్‌దారులకు ముందుగానే సచివాలయ వెల్ఫేర్ అసిస్టెంట్స్ నోటీసులు అందజేస్తారని ఆ నోటీసులో పింఛన్‌దారు ఏ తేదీ.. ఏ సమయంలో హాస్పిటల్‌కు హాజరు కావాలో ఉంటుందన్నారు. ఎవరైనా వారికి ఇచ్చిన షెడ్యూల్ ప్రకారం హాజరు కాని ఎడల వచ్చే నెలలో వారి పింఛన్ తాత్కాలికంగా నిలిపివేయబడుతుందని సుభాని తెలిపారు.

పుట్టలమ్మ హుండీ ఆదాయం రూ.43,979

కర్లపాలెం: యాజలి గ్రామ దేవత పుట్టలమ్మ అమ్మవారి ఆలయ హుండీల ఆదాయం రూ.43,979 వచ్చినట్లు ఈవో శ్రీనివాసరావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. అమ్మవారి ఆలయంలోని హుండీలలోని కానుకలను ఆలయ ఈవో శ్రీనివాసరావు పర్యవేక్షణలో గురువారం భక్తులు, ఆలయ అర్చకులు లెక్కించారు. ఈ ఆదాయం గత సంవత్సరం కంటే రూ.2 వేలు అదనంగా వచ్చినట్లు ఆయన తెలిపారు. అమ్మవారి ఆలయంలోని 1వ నంబర్ హుండీలో రూ.1,563, రెండవ హుండీలో రూ.42,416 వచ్చినట్లు ఈవో పేర్కొన్నారు.

మండలంలో ప్రత్యేక అవసరాల పిల్లల గుర్తింపు



చెరుకుపల్లి: సమగ్రశిక్ష ఆధ్వర్యంలో మండలంలో ప్రత్యేక అవసరాల గల పిల్లలను గుర్తించటం జరుగుతుందని మండల విద్యాశాఖ అధికారులు టి.నవీన్‌కుమార్, పులి లాజర్ తెలిపారు. మండల విద్యావనరుల కేంద్రంలో గురువారం వారు మాట్లాడుతూ ప్రత్యేక అవసరాల(మానసిక, శారీరక, వినికిడి, దృష్టి, మరియు మాట లోపం గల పిల్లలను) గల బాలబాలికల గుర్తింపు కార్యక్రమం ఈ నెల 13 నుంచి జూన్ 9వ తేదీ వరకు జరుగుతుందన్నారు. మండలంలోని గ్రామాల్లో ఐఈఆర్పీ ఉపాధ్యాయులు (ఇన్‌క్లోజివ్ ఎడ్యుకేషన్ రిసోర్స్ టీచర్) డి.రవీంద్రబాబు, టి.వి.మహాలక్ష్మీ ప్రత్యేక అవసరాలు గల పిల్లలను గుర్తించి ఆయా గ్రామాల పరిధిలోని పాఠశాలల్లో చేర్పించటం జరుగుతుందన్నారు.

రాచూరులో హనుమజ్జయంతి వేడుకలు



భట్టిప్రోలు (కొల్లూరు) : హనుమత్ జయంతి వేడుకలు మండలంలోని రాచూరు సువర్చలా సమేత ఆంజనేయస్వామి ఆలయంలో వైభవంగా నిర్వహించారు. పరిసర ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు ప్రత్యేక అలంకారంలో ఉన్న స్వామి వారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. తెల్లవారుజాము నుంచి వచ్చిన భక్తులకు ఆలయ అర్చకులు దీవి వెంకట నరసింహాచార్యులు విశేషమైన పూజలు నిర్వహించి తీర్థప్రసాదాలు అందజేశారు.

బాపట్లలో...



బాపట్ల: హనుమజ్జయంతి సందర్భంగా వైభవంగా ఆంజనేయస్వామి దేవాలయాల్లో పూజలు నిర్వహించారు. పట్టణంలోని సూర్యలంక రోడ్డులోని ఆంజనేయస్వామి దేవాలయంలో ఉదయం నుంచి ప్రత్యేక పూజలు చేయటంతోపాటు హనుమాన్‌చాలీసా పారాయణ చేపట్టారు. మహర్షి ఆశ్రమ గోశాలలో హనుమాన్ మూలమంత్ర హోమం, 11 పర్యాయాలు హనుమాన్ చాలీసా పారాయణ మహా ప్రసాద వితరణ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో నిర్వాహకులు బాబు నాగేంద్ర, సంపత గణపతి పరివార్ సభ్యులు మామిడి రాజశేఖర్, శ్రీహరి నారాయణ, మలిశెట్టి భ్రమరాంబ, కోనపురెడ్డి రామతులసి, కొత్త శ్రీదేవి, శ్యామలాదేవి, బుర్లే భారతి, బుర్లే భాగ్యలక్ష్మి, వెంకటలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

రీ సర్వే చేశారు.. హద్దు రాళ్లు మరిచారు



వరహాపురం గ్రామంలో రీ సర్వే పొలాలకు హద్దు రాళ్లు వేయని దృశ్యం



బలిజేపల్లిలో రీ సర్వే పొలాల్లో వేసిన హద్దు రాళ్లు (వైఎస్సార్‌సీపీ హయాంలో)

- రీ సర్వే పొలాలకు వేయని సరిహద్దు రాళ్లు
- వివాదాలు తలెత్తే అవకాశం ఉందని రైతుల ఆందోళన
- గత ప్రభుత్వంలో రీ సర్వే పూర్తయిన వెంటనే వేసిన వైనం

వేమూరు: గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో చేపట్టిన భూ రీ సర్వేను తీవ్రంగా కూటమి నాయకులు వ్యతిరేకించారు. కానీ కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన తర్వాత భూ రీ సర్వేను మరలా ప్రారంభించారు. మొదటి విడత రీ సర్వే చేసిన సరిహద్దు రాళ్లు వేయలేదని రైతులు ఆరోపిస్తున్నారు. వైఎస్సార్‌సీపీ అధికారంలో భూ రీ సర్వే చేసిన పొలాలకు హద్దు రాళ్లు వేశారు. కూటమి ప్రభుత్వం రీ సర్వే చేసిన పొలాలకు హద్దు రాళ్లు ఎందుకు వేయలేదని రైతులు ప్రశ్నిస్తున్నారు. పొలాలు రీ సర్వే చేసి హద్దు రాళ్లు వేయకపోవడంతో పలు సమస్యలు తలెత్తుతున్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీంతో పక్క పొలాల వారితో తగాదాలు, హద్దు వివాదాలు తలెత్తే అవకాశం ఉందని రైతులు ఆందోళన చెందుతున్నారు.

రీ సర్వే గ్రామాలు...

వేమూరు నియోజకవర్గంలో మొదటి విడత రీ సర్వేలో భాగంగా వేమూరు మండలంలోని వరహాపురం, కొల్లూరు మండలంలో చినపులివర్రులోని గురుందపల్లి, భట్టిప్రోలు మండలంలో గొరికపూడి, అమర్తలూరు మండలంలో కోడితాడిపర్రు, చుండూరు మండలంలో మండూరు గ్రామాల్లో పొలాలను రీ సర్వే పూర్తి చేశారు. రీ సర్వే పూర్తయిన పొలాలకు హద్దు రాళ్లు ఇంతవరకు వేయలేదని రైతులు తెలిపారు. రెండవ విడత భూ రీ సర్వే పనులు కూడా ప్రారంభం చేశారు. రెండవ విడత రీ సర్వేలో వేమూరు మండలంలోని కుచ్చెళ్లపాడు, కొల్లూరు మండలంలో ఈపూరు, భట్టిప్రోలు మండలంలో సూరేపల్లి, అమర్తలూరు మండలంలో బోడపాడు, చుండూరు మండలాల్లో చినపరిమి గ్రామాల్లో ప్రారంభించారు.

గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో...

గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో వేమూరు మండలంలోని పులిచింతల పాలెం, పోతుమర్రు, బలిజేపల్లి, అబ్బనగూడవల్లి, చావలి గ్రామాల్లో రీ సర్వే చేశారు. రీ సర్వే చేసిన పొలాలకు హద్దు రాళ్లు వేశారు. కొల్లూరు మండలంలోని బొద్దులూరుపాడు, దోనేపూడి, క్రాప గ్రామాల్లో పొలాలు రీ సర్వే చేసి హద్దు రాళ్లు వేశారు. భట్టిప్రోలు మండలంలో గొరికపూడి గ్రామంలో రీ సర్వే చేసి హద్దు రాళ్లు వేశారు. అమర్తలూరు మండలంలో యలవర్రు, బోడపాడు గ్రామాల్లో, చుండూరు మండలంలో తోట్టింపూడి, పెదగాదెలవర్రు, పెనుగుదురుపాడు, చుండూరుల్లో రైతులు పొలాలు రీ సర్వే చేసి పొలాలకు హద్దు రాళ్లు వేశారు. కూటమి ప్రభుత్వం రీ సర్వే చేసి హద్దు రాళ్లు వేయలేదని రైతులు వాపోతున్నారు.



సమస్యలు ఉండి పోయాయి

కూటమి ప్రభుత్వంలో పొలాలు రీ సర్వే చేశారు గానీ పొలాల హద్దుల్లో రాళ్లు వేయలేదు. గత ప్రభుత్వంలో పొలాలు రీ సర్వే చేసి హద్దు రాళ్లు వేయడంతో సమస్యలు లేకుండా పోయినవి. రాళ్లు వేయకపోవడంతో సమస్యలు ఉండి పోయాయి.

– ఈపూరు యోహాను, రైతు, వరహాపురం



హద్దుల సమస్యలు లేవు

గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం భూ రీ సర్వే చేసి పొలాల్లో హద్దు రాళ్లు వేయడం జరిగింది. దీంతో పొలాల హద్దులు వద్ద ఎలాంటి సమస్యలు లేకుండా పొలాలు సాగు చేసుకుంటున్నాం.

– రాయపూడి బుజ్జిబాబు, రైతు, బలిజేపల్లి

వరికూటి అశోక్‌బాబును కలిసిన షేక్ ఇమామ్ హుస్సేన్



అమర్తలూరు(వేమూరు): పార్టీ కోసం పని చేసిన ప్రతి వ్యక్తిని గుర్తించడం జరుగుతుందని పార్టీ అధికార ప్రతినిధి, నియోజకవర్గ సమన్వయకర్త వరికూటి అశోక్‌బాబు అన్నారు. అమర్తలూరు మండల కేంద్రానికి సంబంధించిన షేక్ ఇమామ్ హుస్సేన్ గురువారం వరికూటి అశోక్‌బాబు స్వగృహంలో కలిశారు. వైఎస్సార్‌సీపీ ముస్లిం మైనార్టీ సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా నియామకం చేసిన వరికూటి అశోక్‌బాబుకు అభినందనలు తెలిపారు. ఆయనను శాలువతో సన్మానం చేశారు. వరికూటి అశోక్‌బాబు మాట్లాడుతూ పదవులు పొందిన ప్రతి ఒక్కరూ పార్టీ కోసం పని చేయాలని సూచించారు. పార్టీ కోసం పని చేసిన ప్రతి వ్యక్తిని గుర్తించడం జరుగుతుందని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ రాపర్ల నరేంద్ర, మండల పార్టీ అధ్యక్షుడు హేమ చంద్ర శ్రీనివాసరరావు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

భక్తులకు అన్నప్రసాద వితరణ

తెనాలి: పట్టణ రజకచెరువు వద్ద గల శ్రీ ఆంజనేయ స్వామి ఆలయంలో హనుమత్ జయంతిని ఘనంగా నిర్వహించారు. స్వామివారిని ప్రత్యేకంగా అలంకరించారు. విశేష పూజలు చేశారు. బీఎస్ఆర్ నాయుడు ఆధ్వర్యంలో రెండు వేలమంది భక్తులకు అన్నప్రసాద వితరణ చేశారు.

భజే.. వాయుపుత్రం

- వాడవాడలా హనుమజ్జయంతి వేడుకలు
- అధిక సంఖ్యలో పాల్గొన్న భక్తులు

రేపల్లె: హనుమజ్జయంతి ఉత్సవాలను గురువారం నియోజకవర్గంలో వాడవాడలా ఘనంగా నిర్వహించారు. రేపల్లె పట్టణం రైలుపేటలోని వీరాంజనేయ స్వామి ఆలయంలో ఉదయం నుంచే ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామికి ప్రత్యేక అభిషేకాలు నిర్వహించి సింధూరం, పువ్వులతో ప్రత్యేక అలంకరణ చేశారు. తమలపాకులతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ఆవరణంలో హనుమత్ వ్రతం చేశారు. రేపల్లె మండలంలోని పేటేరు ఆంజనేయస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. ఉప్పూడి రోడ్డులోని శ్రీలక్ష్మి గోదా సమేత వేంకటేశ్వరస్వామి ఆలయంలో వేడుకలు చేశారు. బొందలగరువులో భారీ ఆంజనేయస్వామి విగ్రహం వద్ద పరిసర ప్రాంతాలలోని భక్తులతో కిటకిటలాడింది. పట్టణంలోని పట్టాభిరామస్వామి ఆలయం, కోదండ రామాలయం, వేణుగోపాల స్వామి ఆలయం, సింగుపాలెం, నల్లూరుపాలెం, కైతేపల్లి, తుమ్మల, కారుమూరు, తదితర గ్రామాలలోని ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు.

కొల్లూరులో...

కొల్లూరు : హనుమజ్జయంతి వేడుకలు మండల వ్యాప్తంగా ఘనంగా నిర్వహించారు. గురువారం మండలంలోని ఆంజనేయస్వామి ఆలయాలు, విగ్రహాల వద్ద భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. హనుమజ్జయంతి, జవానులకు మద్దతుగా జాతీయ జెండాలు, కాషాయ పతాకాలతో ద్విచక్ర వాహనాలతో భారీ ర్యాలీ నిర్వహించారు. కొల్లూరు గొడపాలెం, లాక్‌సెంటర్‌లోని ఆంజనేయస్వామి ఆలయాలు, వైష్ణవాలయంలోని హనుమంతుని విగ్రహాలను ప్రత్యేకంగా అలంకరించి పూజలు నిర్వహించారు. మండలంలోని ఈపూరులంకలో 108 పర్యాయాలు హనుమాన్ చాలీసా పఠించడంతోపాటు, మహిళలు భజనలు చేశారు. ఆలయ ప్రతిష్ఠ జరిగి ఐదేళ్లు పూర్తయిన సందర్భంగా అన్నదాన కార్యక్రమం చేపట్టారు. మండలంలోని చినపులివర్రులోని ఆంజనేయుని విగ్రహం వద్ద ఘనంగా పూజలు చేశారు.

వేమూరులో...

వేమూరు: మండలంలోని జంపని గ్రామంలో ఆంజనేయస్వామి ఆలయ ప్రాంగణంలో నిర్మితమైన సీతారామాంజనేయ కల్యాణ మండపం మొదటి అంతస్తును గురువారం ఉదయం మొవ్వ శ్యామసుందర్రావు, పెరుమాళ్ల యోగిరాములు దంపతులు ప్రారంభించారు. లక్ష్మీ నరసింహాచార్యులు వేద పారాయణం చేసి సామూహిక సువర్చల సహిత అంజనేయస్వామి శాంతి కల్యాణం, సత్యదేవ వ్రతాలు నిర్వహించారు. భక్తులకు అన్నదానం కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అర్చకులు మేడూరు శ్రీనివాసమూర్తి, అగ్నిహోత్రం చంద్ర శేఖర్, కల్యాణ మండపం నిర్మాణ కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

అమర్తలూరులో...

అమర్తలూరు(వేమూరు): అమర్తలూరు మండలంలోని మోపర్రు గ్రామంలో రుక్మిణి సత్యభామ సమేత వేణుగోపాలస్వామి దేవస్థానంలో ఉపాలయంగా ప్రసిద్ధి చెందిన ప్రసన్నాంజనేయస్వామి ఆలయంలో హనుమజ్జయంతి పురస్కరించుకొని గురువారం ఉదయం వేణుగోపాలస్వామికి నిత్యార్చన కార్యక్రమం అనంతరం ప్రసన్నాంజనేయునికి అర్చన, మన్య సూక్త పూర్వకంగా అభిషేకం తదనంతరం అంజనేయ స్వామికి అష్టోత్తర, శతనామార్చన, సహస్ర నామార్చన తమలపాకులతో పూజలు నిర్వహించారు. 108 మామిడి పండ్లతో స్వామి వారికి విశేషార్చన నిర్వహించారు. స్థానిక వేణుగోపాలస్వామి భక్త మండలి 108 సార్లు హనుమాన్ చాలీసా పారాయణ నిర్వహించారు. అర్చకులు బృందావనం వరదాచార్యులు, వెంకటరమణ దీక్షతులు, ఆధ్వర్యంలో పూజలు నిర్వహించారు. ఆలయ కార్యనిర్వహణ అధికారి నాగమల్లేశ్వరి, భక్తులు పాల్గొన్నారు.



రేపల్లె వీరాంజనేయస్వామిని దర్శించుకుంటున్న భక్తులు

కర్లపాలెంలో...

కర్లపాలెం: హనుమజ్జయంతి సందర్భంగా మండల పరిధిలోని ఆంజనేయస్వామి దేవాలయాలు, విగ్రహాల వద్ద గురువారం భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించారు. హనుమాన్ జయంతి సందర్భంగా మండల పరిధిలోని శీలంవారిపాలెం గ్రామ శివారులో ఉన్న ఆంజనేయస్వామి విగ్రహానికి, చింతాయపాలెం గ్రామంలోని అభయాంజనేయస్వామి, నడుంపాలెంలోని ఏకశిల ఆంజనేయస్వామి, అయ్యప్పస్వామి ఆలయం వద్ద ఉన్న ఆంజనేయస్వామి భారీ విగ్రహానికి, పెదపులుగువారిపాలెం, దుండివారిపాలెం, పెదగొల్లపాలెంలోని పంచముఖ ఆంజనేయస్వామి విగ్రహాల వద్ద భక్తులు పూజలు చేశారు. కర్లపాలెం అగ్రహారం, దమ్మనవారిపాలెం, యాజలి, ఏట్రవారిపాలెం, ఎంవీరాజుపాలెం, బుద్ధాం, గ్రామాలలో ఆంజనేయస్వామి విగ్రహాలకు భక్తులు విశేష పూజలు చేసి మొక్కులు చెల్లించారు. పెదగొల్లపాలెం, చింతాయపాలెం, దుండివారిపాలెం, పెదపులుగువారిపాలెం ఆంజనేయస్వామి విగ్రహాల వద్ద అన్నదానం చేశారు. సత్యసాయి గ్రామీణ సేవా సమితిలో గత 40 రోజులుగా చేస్తున్న హనుమాన్ చాలీసా పారాయణ ముగియటంతో భక్తులకు ప్రసాదాలు పంపిణీ చేసి అన్నసంతర్పణ చేశారు.



108 మామిడి పండ్లతో ప్రసన్నాంజనేయునికి అర్చన కార్యక్రమం



కొల్లూరులో ప్రత్యేక అలంకారంలో ఆంజనేయస్వామి

పిట్టలవానిపాలెంలో...

మండల పరిధిలోని కప్పలవానిపాలెం గ్రామంలో హనుమజ్జయంతి సందర్భంగా ఆంజనేయస్వామి విగ్రహానికి వైఎస్సార్‌సీపీ నాయకులు పిట్టలవానిపాలెం మండల పరిషత్ అధ్యక్షుడు దెందుకూరి సీతారామరాజు క్షీరాభిషేకం చేసి పూజలు నిర్వహించారు. ఖాజీపాపాలెం, మంతెనవారిపాలెం, పిట్టలవానిపాలెం గ్రామాలలో ఆంజనేయస్వామి విగ్రహాలకు భక్తులు భక్తిశ్రద్ధలతో అభిషేకాలు, విశేష పూజలు నిర్వహించారు.

హిందూ ధర్మం విశిష్టత తెలియజేసేలా...

రేపల్లె: హిందూ ధర్మం విశిష్టతను గ్రామ గ్రామాన విస్తరింపజేసేలా విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు పరిషత్ జిల్లా కో ఆర్డినేటర్ జి.కుటుంబరావు చెప్పారు. హనుమజ్జయంతిని పురస్కరించుకొని విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో పేటేరు భజన సంఘాల సహకారంతో గురువారం పేటేరు గ్రామంలో హనుమాన్ శోభ యాత్రను నిర్వహించారు. యాత్రను ప్రారంభించి కుటుంబరావు మాట్లాడుతూ ప్రపంచ దేశాలు గౌరవించే హిందూ ధర్మాన్ని ప్రతి ఒక్కరూ ఆచరించాలని కోరారు. ఈ సందర్భంగా గ్రామంలోని ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో విశ్వహిందూ పరిషత్ సభ్యులు కిషోర్ బాబు, సాయిబాబు, అన్నం సాయి, మురళీకృష్ణ ప్రసాద్, నాగలీల, నాంచారయ్య, చంద్రమ్మ, రత్నకుమారి తదితరులు పాల్గొన్నారు.



సువర్చల సహిత అంజనేయ కల్యాణంలో భక్తులు



కప్పలవానిపాలెంలో ఆంజనేయస్వామికి క్షీరాభిషేకం చేస్తున్న ఎంపీపీ సీతారామరాజు

నగరంలో...

నగరం: హనుమజ్జయంతి ఉత్సవాలను గురువారం మండలంలోని పలు గ్రామాలలో అత్యంత వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అభయాంజనేయ విగ్రహాల వద్ద భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. నగరంలోని వీరాంజనేయస్వామి ఆలయంలో లక్ష మల్లెలతో అర్చన, తమలపాకుల పూజలను కనుల పండువగా జరిపించారు. మండలంలోని ఈదుపల్లి, మీసాలవారిపాలెం, లుక్కావారిపాలెం, గూడపాటివారిపాలెం గ్రామాలలోని ఆలయాల్లో విశేష పూజలు నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు.

చెరుకుపల్లిలో...

చెరుకుపల్లి: మండలంలోని గ్రామాల్లో అభయాంజనేయస్వామి విగ్రహాల వద్ద హనుమజ్జయంతి వేడుకలు గురువారం ఘనంగా నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని స్వామివారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. మండల కేంద్రంలోని చెన్నకేశవ నగర్‌లో అభయాంజనేయస్వామికి అభిషేకాలు, ఆకు పూజ నిర్వహించి ఆలయ కమిటీ అధ్యక్షుడు ఉప్పలపాటి వెంకట సుబ్బయ్య, గౌరవ అధ్యక్షుడు రావూరి ఆంజనేయులు ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు, మండలంలోని కామినేనివారిపాలెంలో ఏపీసీపీఈఎస్ జిల్లా అధ్యక్షుడు గుర్రం మురళిమోహన్ ఆధ్వర్యంలో మండల స్థాయి క్విజ్ పోటీలు నిర్వహించారు. క్విజ్ పోటీల్లో విజేతలకు మురళి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో పీటా శ్రీనివాసరావు, బొలగాని సుబ్బారావు, ఈపూరి వెంకట దుర్గా ప్రసాద్ పాల్గొన్నారు.



విజేతలకు బహుమతులు అందిస్తున్న గ్రామ పెద్దలు, గుర్రం మురళి



రేపల్లె వీరాంజనేయస్వామి ఆలయంలో హనుమత్ వ్రతంలో పాల్గొన్న భక్తులు



కొల్లూరులో ద్విచక్ర వాహన ర్యాలీ నిర్వహిస్తున్న భక్తులు



ఈపూరులంకలో భజన కార్యక్రమాలలో మహిళలు



పెదగొల్లపాలెంలో పూజలందుకున్న ఆంజనేయస్వామి



శోభయాత్రలో పరిషత్ సభ్యులు



ఈదుపల్లిలో...

విమాన గోపుర శిఖరం కింద రాగి యంత్రం, నాణెములు లభ్యం

చందోలు(కర్లపాలెం): చందోలు గ్రామంలో వేంచేసియున్న లింగోద్భవ దేవస్థానం ఆవరణలోని శిథిలావస్థలో ఉన్న కల్యాణ మండపం విమాన గోపురం తొలగిస్తుండగా 3 అంగుళాల రాగి యంత్రం, పురాతన రాగి నాణెములు లభించాయని ఈవో నరసింహమూర్తి తెలిపారు. ఆలయ ప్రాంగణంలోని శిథిలమైన కల్యాణ మండపంను తొలగించి నూతన మండపం నిర్మించేందుకు గురువారం శిథిలమైన విమాన గోపుర శిఖరానికి ఆలయ అర్చక స్వాములు శ్రీనివాసశాస్త్రి, పూజలు చేసిన అనంతరం శిథిలమైన గోపురాన్ని తొలగిస్తుండగా శిఖరం కింద మూడు అంగుళాల రాగి యంత్రం, 1918 సంవత్సరానికి చెందిన 8 రాగి నాణెలు లభించాయని, వాటిని ఆలయ అర్చకులు శ్రీనివాస శాస్త్రి ఆధ్వర్యంలో భద్రపరిచి నూతన కల్యాణ మండపం నిర్మాణం అనంతరం విమాన గోపుర శిఖరం కింద నిక్షిప్తం చేస్తామని ఈవో నరసింహమూర్తి తెలిపారు. కార్యక్రమంలో డీఈ శ్రీనివాసులు, ఏఈ మధు, భక్తులు, సాంబశివరావు, నాంచారయ్య, నాగేంద్రరెడ్డి, బ్రహ్మానందరెడ్డి, వెంకటేశ్వరరెడ్డి, శివారెడ్డి, అంజిబాబు తదితరులు ఉన్నారు.



ప్రయాణికులకు అదనపు సౌకర్యాలు కల్పించాలి

రేపల్లె: రైల్వే ప్రయాణికులకు అదనపు సౌకర్యాలు కల్పించాలని పట్టణాభివృద్ధి సంఘం కార్యదర్శి సి.వి.మోహన్‌రావు గురువారం ఒక ప్రకటనలో కోరారు. ప్రయాణికులకు కల్పించాల్సిన సౌకర్యాలపై డివిజనల్ రైల్వే మేనేజర్‌కు వినతి పత్రం ఫ్యాక్స్ ద్వారా పంపామన్నారు. రేపల్లె– సికింద్రాబాద్ డెల్టా ఎక్స్‌ప్రెస్‌లో ఏసీ కోచ్‌లో సౌకర్యాలు మెరుగుపరచాలని కోరారు. ఏసీ కోచ్‌ల్లో అంతకుముందు ప్రయాణికులు వినియోగించిన దిండ్లు, దుప్పట్లను శుభ్రం చేయకుండా అలాగే ప్రయాణికులకు అందిస్తున్నారని ఆరోపించారు. వాటిని వినియోగించే ప్రయాణికులకు చర్మ వ్యాధులు సోకే ప్రమాదం ఉందన్నారు. శుభ్రం చేసిన వాటిని అందించాలని కోరారు. అదేవిధంగా ప్రయాణికుల రద్దీని దృష్టిలో ఉంచుకొని రేపల్లె గుంటూరుకు తెనాలి మీదుగా ప్రతి 2 గంటలకు ఒక రైలును నడిపేలా చర్యలు తీసుకోవాలన్నారు. పల్నాడు, రాయగడ, తిరుపతి ఎక్స్‌ప్రెస్‌లను రేపల్లె నుంచి నడపాలని కోరారు. రేపల్లె రైల్వే స్టేషన్‌లో జరుగుతున్న అభివృద్ధి పనులను త్వరితగతిన పూర్తి చేసి ప్రయాణికుల అసౌకర్యాన్ని తొలగించాలని కోరారు.